క్లుప్తంగా

ఉపాధి పనులపై నేడు బహిరంగ ప్రజావేదిక

బల్లికురవ: మండలంలోని 21 గ్రామ పంచాయతీలో 2022–23 సంవత్సరానికి జరిగిన పనులపై శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆ పథక ఏపీవో బాలకృష్ణ నాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలో జరిగిన రూ.10 కోట్లకు సంబంధించి ఈనెల 14వ తేదీ నుంచి శుక్రవారం వరకు సామాజిక తనిఖీ బృందాలు గ్రామ పంచాయితీల వారీగా తనిఖీ నిర్వహించారని చెప్పారు. తనిఖీలో వెల్లడైన విషయాలను బహిరంగ ప్రజా వేదికలో వివరిస్తారని చెప్పారు. ప్రజావేదికకు డ్వామా పీడీ, ఏపీడీ తోపాటు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని బాలకృష్ణనాయక్ వివరించారు.

29 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎస్సై

సంతమాగులూరు (అద్దంకి రూరల్): అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని చవిటిపాలెంలో శుక్రవారం ఎస్సై శివకుమార్ సిబ్బందితో అక్రమంగా అమ్మకాలు నిర్వహిస్తున్న షాపులపై దాడులు చేసి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పనులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సెక్రటరీలు, ఎంపీడీవో

బల్లికురవ: గ్రామ పంచాయతీ మండల పరిషత్ అభివద్ధి పనులకు 2024–25 సంవత్సరానికి ఈ గ్రామ స్వరాజ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవోఎల్ బ్రహ్మయ్య కోరారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల్లోని సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్‌లతో పంచాయతీరాజ్ కమిషనర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ తదుపరి ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి అభివృద్ధి పరిచేందుకు మంచి అవకాశం అన్నారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల సహకారం కూడా అప్‌లోడ్ చేయడంతో తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఈవోఆర్డీ డీ.సుమతి పాల్గొని మాట్లాడారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, మర్గశిరమాసం, పుష్యమి నక్షత్రం తదియ తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రైలు నుంచి జారిపడిన వ్యక్తిని రక్షించిన స్థానికులు

చినగంజాం: రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన ఓ వ్యక్తిని స్థానికులు రక్షించారు. అందిన సమాచారం మేరకు..రైలులో ప్రయాణిస్తున్న 25 ఏళ్ల అనిత్ వ్యక్తి శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు రైలు నుంచి చినగంజాం మహాలక్ష్మీ కాలనీ వద్ద రైలు పట్టాల పక్కన జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. లేవలేని స్థితిలో ఉండి అటుగా వెళ్తున్న స్థానికులను చేయెత్తి కేకలు వేయడంతో 108కు సమాచారం అందించారు. ఈఎంటీ నాగలక్ష్మి, పైలట్ భాగ్యారావు సాయంతో చీరాల ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



క్షతగాత్రుడు అనిత్



చెన్నుపల్లిలో జరుగుతున్న కబడ్డీ పోటీలు



చీరాలలో క్రికెట్ కిట్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పమిడిపాడులో షటిల్ ఆడుతున్న మహిళలు

క్రీడా నైపుణ్యాల గుర్తింపునకే ఆడుదాం ఆంధ్రా

- క్రీడలతో మానసిక ఉల్లాసం
- ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

బల్లికురవ/మేదరమెట్ల: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకుల్లో ప్రతిభ, క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రవేశపెట్టిందని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం బల్లికురవ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, చెన్నుపల్లి, కొప్పరపాలెం, గ్రామ సచివాలయాల పరిధిలో ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో టీమ్‌లు నువ్వానేనా అన్నట్లు తలబడ్డాయి. సచివాలయ మహిళా పోలీసులు, పాఠశాలల పీడీలు, రిఫరీలుగా వ్యవహరించారు.

■ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడోత్సవాలను నిర్వహించడంలో భాగంగా కొరిశపాడు మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు కొనసాగాయి. క్రికెట్, ఖోఖో, షటిల్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. ఆటలు ఆడేందుకు యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారివారి ప్రతిభలను కనపరిచారు.

యువతలో నైపుణ్యాల మెరుగుకే ఆడుదాం ఆంధ్రా..

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకుల్లోని క్రీడా నైపుణ్యాలను, వారిలోని ప్రతిభను గుర్తించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడులో డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని యువతీ, యువకులకు పోటీతత్వంపై అవగాహన కల్పించారు. బ్యాడ్మింటన్, షటిల్ ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో యువతీ, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, ఏపీఎం మధుసూదనరావు, కే అంజయ్య, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాశీం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఎన్ ప్రదీప్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



కారంచేడులో షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ



బల్లికురవ కేజీబీవీలో జరుగుతున్న ఖోఖో పోటీలు



పమిడిపాడులో క్రికెట్ ఆడుతున్న యువకులు



కొప్పరపాలెంలో బాడ్మింటన్ పోటీలు

గంగపుత్రులకు అండగా కిసాన్ క్రెడిట్ కార్డులు

చీరాల టౌన్: సముద్రంలో వేట చేస్తూ జీవనం సాగించే మత్స్యకారులను ఆదుకోవడంతో పాటు వేట సామగ్రిని కొనుగోలు చేసుకుని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకునేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుతో రుణాలు అందిస్తుందని వాడరేవు మత్స్యసహాయకులు డార్విన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వాడరేవు గ్రామ సచివాలయంలో మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మత్స్యశాఖ సహాయకులు డార్విన్ మాట్లాడుతూ మత్స్యకారులు అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు, రాయితీలను అందిస్తుందన్నారు. 75 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు సీ సేఫ్టీ పరికరాలు కూడా అందిస్తుందన్నారు. లబ్ధిదారుడికి రూ.1 లక్ష వరకు కిసాన్ క్రెడిట్ రుణాలతో వేట పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు ఉన్నారు.

చినగంజాం: ఆక్వారైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు మత్స్యశాఖ ఎల్లప్పుడు చేదోడు వాదోడుగా ఉంటుందని మత్స్యశాఖ గ్రామ సహాయకురాలు కొమిరా ప్రమీల అన్నారు, శుక్రవారం మోటుపల్లి పంచాయతీ పరిధిలోని ఆక్వారైతు చెరుకూరి లక్ష్మీనారాయణ చెరువుల వద్ద వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి నాణ్యత పరీక్షల కోసం మత్స్యశాఖ ఏర్పాటు చేసిన దేశాయిపేటలోని ఆక్వాల్యాబ్ గురించి అవగాహన కల్పించారు. అవకాశాన్ని ఆక్వా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటుపల్లి గ్రామ రైతులు, సాగర్ మిత్రలు మల్లికార్జున నాయక్, ఎస్ మార్త పాల్గొన్నారు.



ఆక్వా రైతులకు అవగాహన కలిగిస్తున్న మత్స్యశాఖ ప్రతినిధులు

అద్దంకి రూరల్: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వియోగం చేసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రాజెక్టు కోఆర్డినేటర్ పొలవరపు అనప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగులపాడు, వెంకటాపురం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆయుష్మాన్‌భవ కార్డులు, కిసాన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో రూట్ ఆఫీసర్ విజయ్‌పాల్, డీఎల్‌వో హనుమంతరావు, బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



నాగులపాడులో కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్న కో ఆర్డినేటర్



వాడరేవులో మత్స్యకారులకు సూచనలు అందిస్తున్న డార్విన్

అయోధ్య రాముడి అక్షతలు పంపిణీ

చినగంజాం: అయోధ్యలో రామాలయం ప్రతిష్టను పురస్కరించుకొని సీతారామ కళ్యాణ తలంబ్రాలు తలంబ్రాలు అయోధ్య నుంచి రావడంతో వాటిని భక్తులకు అందజేశారు. శుక్రవారం చినగంజాం గ్రామం భావన్నారాయణ స్వామి ఆలయంలో అక్షతారోపణ కార్యక్రమం నిర్వహించారు. అక్షతలను భావన్నారాయణ స్వామి వద్ద వాటిని ఉంచి గ్రామంలోని భక్తుల నుంచి బియ్యం సేకరించి వాటిలో కలిపి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఏఎంఎల్ నరసింహాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పొట్టి జనార్దన శ్రీదేవి దంపతులు కలశం, తలంబ్రాలను ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



అయోధ్య అక్షతలను ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బీసీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

పర్చూరు (చినగంజాం): బీసీల ఐక్యతకు సమస్యల పరిష్కారానికి బీసీ సంక్షేమ సంఘం నిరంతరం పనిచేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. మండల కేంద్రం పర్చూరులో ఓ ఫంక్షన్ హాలులో సంఘం జిల్లా రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి వరకు సంఘ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీ కాలనీలో సమస్యలపై పోరాడాలని నాయకులకు సూచనలు చేశారు. జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మండల కమిటీలు ఇప్పటికే నియమించామని, గ్రామస్థాయి వరకు కమిటీలు ఇంకా బలోపేతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అద్దంకి అధ్యక్షుడిగా చేబ్రోలు రవీంద్రకు నియామక పత్రం అందజేశారు. పర్చూరు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బంకా మాధవరావు, కారుమంచి రామాంజనేయులుకు నియామక పత్రాలు జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు, మద్దిబోయిన తాతయ్య, జిల్లా న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజన్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

లాభాల్లో అద్దంకి మున్సిపాలిటీ

అద్దంకి: మునిసాలిటీ ఒక్క వాటర్ స్కీమ్ మినహా అన్ని విధాలుగా లాభాల్లో ఉందని మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. బడ్జెట్ అజెండాను సీనియర్ అకౌంటెంట్ లీలావతి చదివి వినిపించగా కౌన్సిల్ మిగులు బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం డిసెంబరు ఆఖరులో ప్రవేశపెడతారని చెప్పారు. దానిలో భాగంగా 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించామన్నారు. మున్సిపాలిటీ అన్ని విధాలుగా లాభాల బాటలో ఉందన్నారు. అంటే మిగులు బడ్జెట్‌లో నడుస్తోందని చెప్పారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ ట్యాక్స్‌లు తదితరాల ద్వారా రూ.27.01 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ఇందులో రూ.25.84 కోట్లు ఖర్చులు పోగా రూ.1.26 కోట్లు మిగులుతుందని అంచనా వేశారు. గతేడాది రూ.26.68 కోట్లు ఆదాయం రాగా అందులో రూ.24.10 కోట్లు ఖర్చులు పోగా రూ.2.57 కోట్లు మిగులు ఉందని అకౌంటెంట్ వివరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కే అనంత లక్ష్మి, కౌన్సిలర్లు, సీనియర్ అసిస్టెంట్ అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అకౌంటెంట్ లీలావతి

డీడీలు అందజేసిన రైతులకు విద్యుత్ కనెక్షన్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ సత్యనారాయణ

అద్దంకి రూరల్: డీడీలు అందజేసిన రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు అందించాలని డీఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అద్దంకి డివిజన్‌లో 565 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం డీడీలు అందజేశారని వారికి త్వరలో కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, అద్దంకి, మార్టూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకమెట్టు

చీరాల అర్బన్: ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలక మెట్టు అని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీషు ఉపాధ్యాయులు కె.సుబ్రహ్మణ్యకుమార్ సహకారంతో ఉచిత అభ్యసన సామగ్రి అందించారు. పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా మెటీరియల్‌ను ఉపాధ్యాయులు అందించడం శుభపరిణామన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవ్వాలన్నారు. పరీక్షలకు సరైన ప్రణాళికలు రూపొందించుకుని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.భానుచంద్రమూర్తి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను, పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.



అభ్యసన సామగ్రిని అందుకున్న విద్యార్థులు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం బీ సుబ్బారావు సూచించారు. మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించిందన్నారు. మండలంలో ఉన్న 1764 పొదుపు గ్రూపుల్లో 18900 మంది పొదుపు మహిళలు ఉన్నారని పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాదిని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధి రికవరీలు త్వరగా చేయాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ ఆసరా పథకానికి పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.54 కోట్లు కేటాయించగా చెల్లింపులు చేశారన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో సీసీ, సీవీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

ప్రేరణ బ్రోచర్ ఆవిష్కరణ

అద్దంకి: కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ప్రేరణ బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ వీ మోహనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి అభిప్రాయాలను ప్రేరణ ద్వారా పంచుకోవాలని ప్రిన్సిపాల్ విద్యార్థులను కోరారు. కార్యక్రమాన్ని బోటనీ, కెమిస్ట్రీ విభాగాలు నిర్వహించాయి.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

పాఠశాలకు కుర్చీలు అందజేత

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగి కొల్లిపర నాగయ్య శుక్రవారం అద్దంకిలోని గాజుల పాలెం ఎంపీపీ పాఠశాలకు కుర్చీలు, విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ఉబ్బా దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, షేక్ మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయురాలు ఇందిర పాల్గొన్నారు.

పొక్లెయిన్, ట్రాక్టర్లు పట్టివేత

మేదరమెట్ల: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తూ ట్రాక్టర్లలో తరలిస్తుండగా మేదరమెట్ల పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈఘటన కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం ఎర్రకుంట వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నాడన్న సమాచారం రావడంతో ఎస్సై నాగశివారెడ్డి తన సిబ్బందితో వెళ్లి ఒక పొక్లెయిన్, మూడు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ సుశీలకు సమాచారం ఇచ్చామని తెలిపారు.



స్టేషన్‌లో ఉన్న ట్రాక్టర్లు